సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం, 31, మే, 2023



శాస్త్రీయ ఆధారాలతో శిక్ష

ముఖ్యమైన కేసుల్లో ఆధారాలు శాస్త్రీయంగా సేకరించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పోలీసులకు సూచించారు. 10లో



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 692 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
39.7°/ 23.2°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కార్డుదారులకు రేపటి నుంచి రాగుల పంపిణీ



పుట్టపర్తి అర్బన్: కార్డుదారులకు 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా రాగులు అందజేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5,60,953 తెల్లరేషన్ కార్డులుండగా, ప్రభుత్వం 525 మెట్రిక్ టన్నుల రాగులు కేటాయించిందన్నారు. ఇప్పటి వరకూ 369 మెట్రిక్ టన్నులు జిల్లాలోని వివిధ మండలాలకు చేరాయని, తక్కిన 156 మెట్రిక్ టన్నుల రాగులు రెండుమూడు రోజుల్లో సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో 1, 2 తేదీల్లో తొలి విడతగా పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, హిందూపురం రూరల్, హిందూపురం అర్బన్, లేపాక్షి, కదిరి, పరిగి, తలుపుల, బత్తలపల్లి, ధర్మవరం, తాడిమర్రి తదితర 15 మండలాల్లోని కార్డుదారులకు కిలో బియ్యం తగ్గించి వాటికి బదులు కిలో రాగులు అందజేయనున్నట్లు చెప్పారు. స్టాక్ పూర్తి స్థాయిలో రాగానే తక్కిన మండలాల్లో పంపిణీ చేస్తామని వెల్లడించారు.

పశుశాఖలో ఆఫీస్ సబార్డినేట్ల బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న 16 మంది ఆఫీసు సబార్డినేట్లకు మంగళవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కౌన్సిలింగ్ నిర్వహించిన వారందరికీ తాజాగా పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారిలో కె.మహేష్, సి.కొండన్న, బి.రామకృష్ణ, కె.శ్రీనివాసులు, డి.అనిల్‌కుమార్, జి.రామాంజినమ్మ, టి.లక్ష్మీదేవి, ఎం.సరోజ, కె.నారాయణ స్వామి, పి.ఓబిరెడ్డి, జి.దేవరాజు, బి.శ్యామల, బి.చక్కీరప్ప, సి.ప్రమీలమ్మ, ఎస్.ప్రతాప్‌నాయుడు, కె.మల్లికార్జున ఉన్నారు. చియ్యేడు వెటర్నరీ అసిస్టెంట్ కె.నారాయణస్వామిని చోళసముద్రంలోని వెటర్నరీ డిస్పెన్సరీ (వీడీ హాస్పిటల్)కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగేళ్ల సంబరం



పెనుకొండలో కార్యకర్తలు, ప్రజలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

వైఎస్ జగన్ జన రంజక పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పెనుకొండ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. రెండు వేల బైక్‌లతో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జయహో జగన్ అంటూ నినదించారు. ఎమ్మెల్యే స్వగృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ తోటగేరి, కోర్టురోడ్ మీదుగా పట్టణంలో సాగింది. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ కేక్ కట్ చేశారు.

మళ్లీ జగనన్నే సీఎం 10లో



పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

రాష్ట్రంలో వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మహమ్మదాబాద్ క్రాస్, ఓడీ చెరువు, నల్లమాడ, వెంగళమ్మ చెరువు, కర్నాటక నాగేపల్లి, బుక్కపట్నం, కొత్తచెరువు మీదుగా పుట్టపర్తి పట్టణంలోని సత్యమ్మ సర్కిల్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. 2024లో ఆల్‌ఫ్రీ హామీలతో వస్తున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు సూచించారు.

ఆల్ ఫ్రీ బాబును నమ్మకండి 10లో

రైతుకు పెట్టుబడి భరోసా

ఖరీఫ్ వస్తే రైతు గుండెల్లో దడ పుట్టేది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం ఇతరుల వద్ద చేతులు చాచాల్సి వచ్చేది. డబ్బులున్నా విత్తనం దొరికేది గగనంగా ఉండేది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఖరీఫ్‌కు ముందే పెట్టుబడి సాయం అందుతోంది. ముంగిళ్లలోనే విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. ఫలితంగా రైతన్న రెట్టించిన ఉత్సాహంతో 'ముంగారు' సేద్యానికి సిద్ధమవుతున్నారు.

- రేపు 'రైతు భరోసా' సొమ్ము విడుదల
- ఖరీఫ్‌కు ముందే రైతుకు పెట్టుబడి సాయం
- ఈ ఏడాది జిల్లాలోని 2,75,002 మందికి లబ్ధి
- ఖాతాల్లో జమకానున్న రూ.206.49 కోట్లు



పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విత్తనం పంపిణీకి ముందే 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో పెట్టుబడి సాయం అందిస్తోంది. జూన్ 1వ తేదీన సీఎం జగన్ కర్నూలు జిల్లా పత్తికొండ సభ నుంచి 'పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా' నగదు మొత్తాన్ని బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అధికారులు ఇప్పటికే జిల్లా రైతుల జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచారు. గత నాలుగేళ్లుగా 'రైతు భరోసా' అందుకుంటున్న రైతులకు ఐదో ఏడాది మొదటి విడత కింద రూ.7,500 చొప్పున అందజేయడానికి సిద్ధమవుతున్నారు. అక్టోబర్‌లో రెండో విడత రూ.4 వేలు, 2024 జనవరిలో మిగతా రూ.2 వేలు జమ చేయనున్నారు. స్థానికంగా సాయిఆరామంలో గురువారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

కొత్తగా 5,195 మంది రైతులకు

2023–24వ సంవత్సరానికి గానూ జిల్లాలోని 2,75,002 మంది రైతుల ఖాతాల్లో 'పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా' కింద రూ.206.49 కోట్లు జమ చేయనున్నారు. పథకానికి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే రైతుల కోసం అధికారులు మే 18వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. దీంతో కొత్తగా ఈ ఏడాది అర్హుల జాబితాలోకి 5,195 రైతులు చేరారు.

కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి భరోసా

'పీఎం కిసాన్, రైతు భరోసా' కింద ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున అందజేస్తుండగా, ఇందులో పీఎం కిసాన్ నిధులు కింద మూడు విడతల్లో కేంద్రం రూ.6 వేలు చెల్లిస్తోంది. మిగతా రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు, దేవదాయ భూములు, వక్ఫ్‌బోర్డు , అటవీ భూములను సాగు చేస్తున్న రైతులకు మాత్రం కేంద్రం మొండిచేయి చూపింది. దీంతో సీఎం జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని వారందరికీ పూర్తి మొత్తం రూ.13,500 ఇస్తున్నారు.

పెట్టుబడికి ఇబ్బంది లేదు



విత్తన పంపిణీకి ముందే సీఎం జగన్ రైతు భరోసా డబ్బు బ్యాంకులో వేస్తున్నారు. అందువల్ల విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఇబ్బంది లేదు. ఏటా ఖరీఫ్ సమయంలో రైతు భరోసా నిధులు జమ చేస్తున్న సీఎం ఎందరో రైతులను ఆదుకుంటున్నారు. అంతేకాదు గ్రామంలోనే విత్తన కాయలు, ఎరువులు అందిస్తున్నారు. రైతులకు ఇంత కంటే ఏమి కావాలి.

– చంద్రాయుడు, పెదపల్లి

జాబితా ప్రదర్శించాం



అర్హులందరికీ రైతు భరోసా అందేలా చూశాం. గత ఏడాది వర్తించిన రైతులందరికీ రైతు భరోసా నగదు ఖాతాల్లో జమ అవుతుంది. ఈసారి కొత్తగా 5,195 మంది రైతులు పథకానికి అర్హులయ్యారు. అర్హుల జాబితాను ఇప్పటికే ఆయా ఆర్‌బీకేల్లో ప్రదర్శించాం. 1వ తేదీ నిధులు ఖాతాల్లో జమ అవుతాయి.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఆయా పర్యాటక ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్‌లో పర్యాటక శాఖ రెండో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తనకల్లు మండలం కోటపల్లి వద్ద రూ.149 కోట్లతో ఏర్పాటు చేయనున్న రేస్‌కోర్స్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. పెనుకొండ వద్ద ఉన్నకుంభకర్ణ, తిమ్మమ్మ మర్రిమాను, లేపాక్షి జటాయువు, చిలమత్తూరు వీరాపురం, నసనకోట దుర్గాదేవి ఆలయాల వద్ద పర్యాటక శాఖ దేవదాయ సముదాయాలను లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'కియా' వద్ద ఉన్న గెస్ట్‌హౌస్‌కు సంబంధించిన పెండింగ్ బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు రామచంద్ర, నాగేశ్వరరెడ్డి, ఏటీఓ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాడు –నేడు' పనుల్లో అలసత్వాన్ని సహించను

చెన్నేకొత్తపల్లి : 'నాడు–నేడు' కింద పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో అలసత్వాన్ని సహించబోమని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని న్యామద్దల ఉన్నత పాఠశాలను సందర్శించి జగనన్న విద్యాదీవెన కిట్లను పరిశీలించారు. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకుకిట్లు అందించాలన్నారు. అనంతరం న్యామద్దలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు.



పర్యాటక శాఖ అభివృద్ధిపై చర్చిస్తున్న కలెక్టర్

మ్యానువల్ విధానంలో రిజిస్ట్రేషన్లు

అనంతపురం టౌన్: జూన్ ఒకటి నుంచి భూముల మార్కెట్ విలువ పెరగనున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రెండు రోజులుగా సర్వర్లలో సమస్య తలెత్తింది. దీంతో మ్యానువల్ విధానంలో రిజిస్ట్రేషన్ల చేసే విధంగా సబ్ రిజిస్ట్రార్లకు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయని జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం తెలిపారు. ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదులు పొందిన క్రయవిక్రయదారులకు సంబంధిత డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు రోజులుగా చలానాలు చెల్లించి రిజిస్ట్రేషన్‌లు కాని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండానే రిజిస్ట్రేషన్లు అవుతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మ్యానువల్ విధానంలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. జూన్ 1 నుంచి ప్రభుత్వం సవరించిన మార్కెట్ విలువల మేరకు రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: జేష్ఠ్య పౌర్ణమిని పురస్కరించుకొని తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైలో వెలసిన అరుణాచలస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీన పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, డిపోల నుంచి 6 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ఆయా డిపోల నుంచి బస్సులు 3వ తేదీ సాయంత్రం బయలుదేరి 4వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటాయన్నారు. 50 మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే అదనపు చార్జీలతో ఏ గ్రామం నుంచి అయినా బస్సులు నడుపుతామన్నారు. పూర్తి వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1,000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation. com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు అనంతపురంలోని Ambedkar Convention Centre, Sai Nagar నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో.. : ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం(హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్‌అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి వారు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబరుకు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 4, 2023
వేదిక : అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్, సాయినగర్, అనంతపురం
సమయం : ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

క్లుప్తంగా

ఏఎస్పీకి ఘనంగా వీడ్కోలు



ఏఎస్పీ రామకృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: జిల్లా అదనపు ఎస్పీగా కేవీ రామకృష్ణప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. బదిలీపై వెళుతున్న రామకృష్ణ ప్రసాద్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, డీఎస్పీలు, ఏఆర్ సిబ్బంది, సెబ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఫ్రీ బాబును నమ్మకండి

- పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రశాంతి నిలయం: రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో 600 హామీలతో మేనిఫెస్టో రూపొందించి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు.. అధికారం చేజిక్కించుకున్న తర్వాత మేనిఫెస్టోనే మాయం చేసి ప్రజల కళ్లు గప్పారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆల్ ఫ్రీ బాబుగా అవతారం ఎత్తి మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. ఆల్ ఫ్రీ బాబును నమ్మబోరాదని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం పుట్టపర్తి నియోజకవర్గంలోని అరు మండలాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పుట్టపర్తిలోని సత్యమ్మ సర్కిల్‌లో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేసి, ప్రసంగించారు. పేదల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనతో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. 2014 ఎన్నికల్లో బాబు వస్తే జాబు వస్తుందని, బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఇంటికి వస్తుందని, నిరుద్యోగులకు భృతి అందజేస్తామని నమ్మించిన చంద్రబాబు.. గద్దెనెక్కిన తర్వాత ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తు చేశారు. తన అధికార దాహం కోసం మామ ఎన్టీఆర్‌ను క్షోభకు గురి చేసి, ఆయనకు చావుకు కారకుడైన చంద్రబాబు ఇప్పుడు శత జయంతి ఉత్సవాల పేరుతో కపట నాటకాలకు తెరలేపడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో బడుగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేక ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల కుప్ప అవుతోందని, ఆర్థిక దివాళాతో మరో శ్రీలంకగా మారుతుందని ఎద్దేవా చేసిన చంద్రబాబు... నేడు అవే పథకాలకు పేరు మార్చి తన మేనిఫెస్టోలో ప్రకటించడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా... 2024 ఎన్నికల్లో 175 స్థానాలనూ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. పుట్టపర్తిలో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించి, మరింత అభివృద్ధి చేసేందుకు రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కరరెడ్డి, అనిత, లక్ష్మీదేవి, పార్టీ కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, కొత్తచెరువు రెడ్డెప్పరెడ్డి, బుక్కపట్నం గోవర్ధన్‌రెడ్డి, గంగాద్రి, నారాయణరెడ్డి, కవిత, కన్యాకుమారి, కోగిరి సువర్ణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం



కేక్ కట్ చేస్తున్న పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ

- ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ రూరల్: ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తూ పేదల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న సీఎం వైఎస్ జగన్‌కు మరోసారి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా 2024 ఎన్నికల్లో 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. జగన్ సర్కార్ నాలుగేళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని పెనుకొండలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ స్వగృహం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, తోటగేరి, కోర్టు రోడ్డు, పట్టన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. జయహో జగనన్న, శంకరన్న నాయకత్వం వర్ధిల్లాలి అన్న నినాదాలను హోరెత్తించారు. అనంతరం అశేష జనవాహిని, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే శంకరనారాయణ కేక్ కట్ చేసి, మాట్లాడారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక ఎల్లో మీడియా ద్వారా విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఏకంగా 600 హామీలు ఇచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత అందులో ఏ ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అధికారం ఆల్ ఫ్రీ బాబుగా అవతారం ఎత్తి ప్రజలను దగా చేసేందుకు వస్తున్నాడని మండిపడ్డారు. ఆల్ ఫ్రీ బాబును నమ్మబోరాదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్, వైస్ చైర్మన్లు సునీల్, నందిని, వైఎస్సార్‌సీపీ రూరల్, పట్టణ కన్వీనర్లు నాగలూరు బాబు, నరసింహులు, వైశాలి జయశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆగ్రోస్ చైర్మన్



కలెక్టర్ అరుణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నవీన్‌నిశ్చల్

హిందూపురం: కలెక్టర్ అరుణ్‌కుమార్‌ను ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అరుణ్‌కుమార్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు. జిల్లా అభివృద్ధితో పాటు హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

బ్లఫ్‌మాస్టర్ భరతం పట్టండి : ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: బ్లఫ్‌మాస్టర్ భరతం పట్టాలని అనంతపురం నాల్గో పట్టణ పోలీసులను ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. సామాన్యుడి అవసరాలను ఆసరాగా చేసుకుని మోసాలకు తెగబడుతున్న ఈ తరహా ముఠా సభ్యులపై దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలోని ఓ ధాబా యజమానిని రాకెట్లకు చెందిన బోయ సురేష్, శ్రీనివాసయాదవ్‌తో పాటు వారి ముఖ్య అనుచరుడు రూ.కోటి దాకా మోసం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. విషయాన్ని ఎస్పీ దృష్టికి బాధితుడు తీసుకెళ్లడంతో ఆయన తీవ్రంగా పరిగణిస్తూ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలంటూ నాల్గో పట్టణ పోలీసులకు రెఫర్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మాయగాళ్ల కోసం విస్తృత గాలింపు చేపట్టారు.

శాస్త్రీయ ఆధారాలతో నిందితులకు శిక్ష

- 'కాఫీ విత్ ఉమెన్'తో సమగ్ర సమాచారం
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- పోలీసు అధికారులకు డీఐజీ ఆర్.ఎన్. అమ్మిరెడ్డి ఆదేశం



ప్రతిభ కనబరచిన మహిళా పోలీసులతో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: ''ప్రతి కేసునూ సవాల్‌గా తీసుకోవాలి. ముఖ్యంగా ఫోక్సో కేసులతో పాటు ఇతర ముఖ్యమైన కేసుల్లో సాంకేతికతను ఉపయోగించి శాస్త్రీయంగా ఆధారులు సేకరించారు. నిందితుడు కేసు నుంచి తప్పించుకునేందుకు వీలులేకుండా కోర్టుకు ఆధారాలు సమర్పించి శిక్ష పడేలా చూడాలి.'' అని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి పోలీసులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో కాఫీ విత్ ఉమెన్‌ను విజయవంతం చేసే విధంగా పోలీసులు ముందుండాలన్నారు. మహిళా పోలీసులు, విలేజ్ పోలీస్ ఆఫీసర్‌లతో కలసి 'కాఫీ విత్ ఉమెన్' కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. అలాగే జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో రోజూ విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం రహదారులపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే వారి విషయాలపై పూర్తి అవగాహన కల్పించాలని, వారికి సమాచారం అందజేసేలా ప్రతి స్టేషన్‌లో ఏర్పాట్లు చేయాలన్నారు.

సిబ్బంది తప్పుచేస్తే చర్యలు తప్పవు

ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, అక్రమ మద్యం, నాటుసారా, గుట్కా, గ్యాంబ్లింగ్, బెట్టింగ్ మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడేవారిపై నిఘా పెంచాలన్నారు. అలాంటి వారికి సిబ్బంది ఎవరైనా సహకరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, బాలికలు, చిన్నారులు గురించి అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, ధూమపానాన్ని అరికట్టేలా పోలీసులు పూర్తి స్థాయిలో పని చేయాలన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, హత్యలు, దోపిడీలు, మిస్సింగ్, చీటింగ్, సైబర్ సంబంధిత నేరాల్లో రికవరీ గురించి సర్కిళ్ల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

పుట్టపర్తి పట్టణ పోలీస్ స్టేషన్, డీఎస్పీ ఆఫీస్, పోలీస్ గెస్ట్ హౌస్‌లను డీఐజీ అమ్మిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పరిసర ప్రాంతాలను ఎస్పీ మాధవరెడ్డితో కలసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు, రికార్డులు, విలేజ్ రోస్టర్‌ను పరిశీలించారు. పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ మహిళా పోలీసులతో మాట్లాడి వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి అర్బన్, రూరల్ సీఐలు బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, జయనాయక్ ఉన్నారు.

శభాష్ కవిత!



పండంటి బిడ్డను చూపుతున్న సచివాలయ ఏఎన్‌ఎం కవిత

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. దాదాపు 35 శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. పింఛన్ కావాలన్నా..రేషన్ కార్డు కావాలన్నా.. ఇంటి పట్టాలు కావాలన్నా.. తాగునీటి సరఫరా సమస్య ఉన్నా.. సివిల్ పనులకు సంబంధించిన పనులు ఉన్నా.. వైద్యం కానీ.. ఆరోగ్యం కానీ.. రెవెన్యూ కానీ.. భూముల సర్వేకానీ.. శిశు సంక్షేమం కానీ.. డెయిరీ కానీ, పౌల్ట్రీ రంగాల సేవలు కానీ.. తదితర సేవలకు సంబంధించి సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న గంటల వ్యవధిలోనే ఉద్యోగులు పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి సకాలంలో సచివాలయ ఏఎన్‌ఎం కాన్పు చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడారు.

ఆపదలో మేమున్నమంటూ.. : కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న కవిత అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. మంగళవారం ఉదయం కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన గర్భిణి వినీతకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గర్భిణిని కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో నూతిమడుగు వద్దకు చేరుకోగానే గర్భిణికి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో వాహనాన్ని పైలెట్ జనార్ధన్ రోడ్డు పక్కన ఆపేశాడు. అదే సమయంలో తిమ్మసముద్రం సచివాలయానికి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఏఎన్‌ఎం కవిత అక్కడకు చేరుకున్నారు. ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణిని చూసి స్పందించిన ఆమె ఈఎంటీ బ్రహ్మయ్య సాయంతో వినీతకు ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు వినీత జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు సకాలంలో కాన్పు చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడిన ఏఎన్‌ఎం కవితను అభినందించారు. ఏఎన్‌ఎం చూపిన చొరవపై కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- 30 నిమిషాల వ్యవధిలో తుదిశ్వాస విడిచిన స్నేహితులు




మృతులు వీరన్న, రవీంద్ర

గుంతకల్లు రూరల్: ఆ ఇద్దరూ ప్రాణస్నేహితులు.. ప్రతి పనినీ కలిసే చేసేవారు.. ఎక్కడికైనా కలిసే వెళ్లేవారు. చివరికి మృత్యువులోనూ వారు స్నేహం వీడలేదు. వివరాలు... గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ఉరుకుందప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వీరన్న (26), అదే గ్రామానికి చెందిన రాము, మహాలక్ష్మి దంపతుల కుమారుడు రవీంద్ర (25) ఇటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. తొమ్మిదేళ్ల క్రితం వీరన్నకు కృపాకుమారితో వివాహం కాగా, 6, 4 సంవత్సరాల వయసున్న ఇద్దరు బిడ్డలున్నారు. ఆరు నెలల క్రితం లక్ష్మి అనే యువతితో రవీంద్రకు వివాహమైంది. వీరన్న, రవీంద్ర ఒకే గ్రామానికి చెందిన వారే అయినా.. ఆటోడ్రైవింగ్ ద్వారానే ఇద్దరూ ప్రాణ స్నేహితులుగా మారారు. కొంత కాలం క్రితం ఇద్దరూ అనారోగ్యం బారిన పడ్డారు. వైద్య పరీక్షల అనంతరం గుండె సంబంధిత వ్యాధితో వీరన్న, షుగర్, బీపీతో రవీంద్ర బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఇద్దరూ మద్యానికి బానిసయ్యారు. దీంతో వారి ఆరోగ్యం మరింత క్షీణించింది. పది రోజుల క్రితం ఆయాసం ఎక్కువ కావడంతో వీరన్నను కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. రవీంద్ర ఆరోగ్య పరిస్థితి కూడా క్షీణించడంతో కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో మంగళవారం తెల్లవారుజాము 5 గంటలకు రవీంద్ర, 5.30 గంటలకు వీరన్న మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం ఇద్దరి మృతదేహాలను కుటుంబసభ్యులు గ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

మట్కా బీటర్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య (చిత్రంలో) సీఐ ఆనందరావు, ఎస్‌ఐ ధరణీబాబు, సిబ్బంది

తాడిపత్రి: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి 17 మంది మట్కా బీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10.02 లక్షల నగదు, మట్కా పట్టీలు, బాల్ పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ గంగయ్య వెల్లడించారు. పట్టణ సీఐ ఆనందరావు, ఎస్‌ఐ ధరణీబాబు నేతృత్వంలో ఏఎస్సైలు రాజశేఖర్, రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మట్కా రాస్తూ చేనేత కాలనీకి చెందిన షేక్ అన్వర్‌బాషా, పాతకోటకు చెందిన గన్నె కృష్ణ, పోరాట కాలనీకి చెందిన తుంగా రామాంజులరెడ్డి, అంజనేయ మాన్యం ప్రాంత నివాసి చుక్కలూరు చాంద్ బాషా అలియాస్ చాంద్, రేగి చెట్టు నూర్ బాషా, శ్రీనివాసపురానికి చెందిన దూదేకుల కుళ్లాయప్ప, జవాజీ జగదీష్, నందలపాడు నివాసి మిద్దె ఓబయ్య, చింతలప్ప వీధికి చెందిన ఉదయగిరి మాబున్నీ, ఇందిరా నగర్ బాషు మున్నీ, అంబేడ్కర్ నగర్ నివాసి సంజామల వన్నూర్‌బీతో పాటు మండలంలోని అక్కన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నబాలయ్య, చంద్రశేఖర్, తలారి నాగరాజు, గన్నెవారిపల్లి కాలనీకి చెందిన తలారి బయన్న, బోడెద్దుల మాధవరెడ్డి పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ. 10,02,000 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. బీటర్ల అరెస్టులో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు. తాడిపత్రి ప్రాంతంలో ఇకపై ఎవరైనా మట్కా నిర్వహిస్తే వారిపై సస్పెక్ట్ షీట్ తెరవడంతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగించి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఫోర్ వీలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు

అనంతపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్‌హబ్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన వారు, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హతను బట్టి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95818 53106లో సంప్రదించాలని కోరారు. కాగా, డిప్లొమో కోర్సులో అడ్మిషన్లకు నిర్వహిస్తున్న ఏపీ పాలిసెట్- 2023 కౌన్సెలింగ్ రెండో రోజు కొనసాగింది. బుధవారం 27,001 నుంచి 43 వేల ర్యాంక్ వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు.

బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

కొత్తచెరువు: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ లింగన్న వెల్లడించారు. సోమవారం జరిగిన చెన్నై, గుజరాత్ ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించి కొత్తచెరువులోని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుని పెద్ద ఎత్తున బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న కొత్తచెరువు నివాసి చంద్రశేఖర్‌తో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసి రూ.51,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పిడుగు పాటుకు ఆవు మృతి

అమడగూరు: మండలంలోని ఎగువగువ్వలపల్లిలో మంగళవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. భారీగా ఉరుములు, మెరుపులు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో పిడుగు రాలడంతో రైతు అంజినప్పకు చెందిన పాడి ఆవు మృతిచెందింది. కుటుంబ పోషణగా ఉన్న రూ.70 వేలు విలువ చేసే పాడి ఆవు కోల్పోవడంతో కుటుంబీకులు బోరున విలపించారు.

కాలుష్య నియంత్రణపై పోటీలు

రాప్తాడు రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు 'కాలుష్య నియంత్రణ', 'పర్యావరణ జీవనశైలి' అంశాలపై పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ సాయిరామ్, కాలుష్య నియంత్రణ శాఖ పర్యావరణ ఇంజినీర్ శంకర్‌రావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'పర్యావరణ హిత శైలి'పై విద్యార్థులను చైతన్య పరిచేలా జూన్ 3న జిల్లా సైన్స్ సెంటర్‌లో వక్తృత్వ, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, సుడోకో, రూబిక్ క్యూబ్ పోటీలు ఉంటాయి. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణిస్తారు. విజేతలకు జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. పూర్తి సమాచారానికి 89859 34531, 86390 92816లో సంప్రదించవచ్చు.